క్లుప్తంగా

ఉద్యోగమేళాలో 11 మంది ఎంపిక



ఉద్యోగ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇందులో అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా సంస్థల ప్రతినిధులు పాల్గొని, నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 21మంది హాజరు కాగా అందులో 11మంది ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకు జీతం, ఇతర అలవెన్సులు వస్తాయని ప్రిన్సిపల్ ఎం.శ్రీలత తెలిపారు. అనంతరం ఆమె ఎంపిక అయిన వారికి నియామకపత్రాలను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, జేకేసీ కోఆర్డినేటర్ సతీష్, అధ్యాపకులు గిరిజమ్మ, కంపెనీ హెచ్ఆర్‌లు జగదీష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఏర్పేడు సీఐగా జయచంద్ర



ఏర్పేడు: స్థానిక నూతన సీఐగా ఎస్ జయచంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏర్పేడు సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామశ్రీనివాసులు తిరుపతి వీఆర్‌కు వెళ్లారు. తిరుపతి వీఆర్‌లోని జయచంద్ర ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నీటి వసతి కల్పించాలి

సత్యవేదు: మండలంలోని 16 గ్రామాలకు నీటి వసతి సమకూర్చాలని బీజేపీ నాయకులు బి.మోహన్ బాబు, సి.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం సత్యవేదు వైద్యశాల తనిఖీకి వచ్చిన ఎమ్మెల్యేను ఆ పార్టీ నేతలు కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే వైద్యశాలలో గైనకాలజిస్టు, అనస్థీషియా డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్వీ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్లను సత్యవేదు వైద్యశాలలో నియమించేందుకు చర్యలు తీసుకొన్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా భవానీ శంకర బిందు విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలోని శ్రీసత్యసాయి బాబా మందిరంలో గురువారం భవానీ బిందు విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. పాండురంగారావు, సరస్వతమ్మ, దామోదర్‌నాయుడు, నాగభూషణం, దాము, సునీల్, చెంగయ్య పాల్గొన్నారు.

నాగలాపురం ఎస్ఐగా సునీల్ కుమార్



నాగలాపురం: పోలీసుస్టేషన్ ఎస్ఐగా సునీల్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాజులమండ్యం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నాగలాపురం పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

ఘనంగా గంగమ్మ జాతర

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట లో గురువారం గంగమ్మ జాతర ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే అమ్మవారి విగ్రహానికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో అంకమ్మ, ముత్యాలమ్మ, గంగమ్మ ముగ్గులు వేసి పూజలు చేశారు. సాయంత్రం పుర వీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

ఎస్పీ కార్యాలయం ఎదుట కుటుంబం ఆత్మహత్యాయత్నం

తిరుపతిక్రైమ్: తిరుపతిలోని ఎస్పీ కార్యాలయం ముందు గురువారం కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. పిచ్చాటూరుకు చెందిన మునస్వామి, జ్యోతి దంపతుల పిల్లలు నింద్ర- పిచ్చాటూరు మధ్య ఉన్న హైవేలో కూల్ డ్రింక్ షాప్ నిర్వహించేవారు. ఏడాది నుంచి అద్దె కట్టకపోవడంతో స్థల యజమాని చాంద్‌బాషా గొడవ పడుతున్నాడు. పోలీసులు సైతం అద్దె కట్టాలని వీరికి సూచించారు. వారు అద్దె కట్టలేదు. చాంద్‌బాషాకు అప్పులు ఎక్కువ కావడంతో స్థలాన్ని త్యాగరాజుకు విక్రయించాడు. మునుస్వామి ఐదు నెలలు కరెంటు బిల్లు కూడా కట్టకపోవడంతో కనెక్షన్ కట్ చేశారు. ఈ క్రమంలో త్యాగరాజు కూల్‌డ్రింక్ షాపును ఖాళీ చేసి స్థలాన్ని తమకు అప్పగించాలని మునుస్వామికి తెలిపారు. వారు స్థలాన్ని ఖాళీ చేయలేదు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలోనే మునస్వామి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. ఆ స్థలం ఖాళీ చేస్తే తనకు బతుకుదెరువు పోతుందని, పెట్రోల్ పోసుకుంటానని బెదిరించాడు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేయాలని పిచ్చాటూరు పోలీసులకు సూచించారు.

వేధింపుల నిరోధక కమిటీలు అవసరం



వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా వైద్యురాలి ఘటనలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తక్షణం అమలు చేయాలి. అలాగే వేధింపుల నిరోధక కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి. వీటన్నింటితోపాటు జిల్లా స్థాయిలో అధికారులు, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, జూనియర్ డాక్టర్లు, మహిళ వైద్యులతో ప్రతి ప్రభుత్వాస్పత్రిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా ఈ కమిటీ సమావేశమై డాక్టర్ల భద్రత సౌకర్యాలపై చర్చించి, వాటిని అమలు చేసేలా ఉండాలి. కోల్‌కతా లాంటి ఘటనలు ఇక పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకురావాలి. – డాక్టర్ విజయ్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నాగలాపురం



మనోధైర్యం కల్పించాలి



ఆస్పత్రుల్లో రాత్రింబవళ్లు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి భద్రత తప్పనిసరిగా కల్పించాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టి వైద్య సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ గార్డ్‌లను నియమించి, అనుమానాస్పద వ్యక్తులు, మద్యం సేవించిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో సంబంధిత పోలీస్ స్టేషన్లు, ఇతర హెల్ప్‌లైన్ నంబర్లు బోర్డుపై ఏర్పాటు చేయాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. – డాక్టర్ అరుణ్ కిషోర్, వైద్యాధికారి, నాగలాపురం పీహెచ్‌సీ

అర్ధాంగి..అర్ధమెరిగి..

వివాహానంతరం వంటింటికే పరిమితం కాలేదు. శ్రీమతిగా తరతరాలకు తరగని ప్రేమని అందిస్తూ..అమ్మగా అవనిని మించిన ఆప్యాయతను పంచుతూ.. ఇంటి పనులు చూస్తూనే.. భర్తలకు తోడుగా సాగుతూ తమ కుటుంబ ఆధారాన్ని కొనసాగిస్తున్నారు. తమకు తెలియని విద్యలో నిష్ణాతులయ్యారు. భర్తలు చేసే మగ్గం పనిలో నేత నేయడం, నూలు వడకడం, పడుగు పేక అతికి అబ్బుర పరుస్తున్నారు. నేతలోనూ మేమూ సగం అంటూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి చేయూత నిస్తున్నారు.

నేత నేస్తున్న మహిళా కార్మికురాలు



- నేతలోనూ సగం నేను అంటున్న మహిళలు
- కుటుంబాలకు ఆసరాగా నిలిచిన అతివలు

సత్యవేదు: పొరుగు జిల్లాలకు చెందిన వారు కూడా తిరుపతికి వచ్చి నేత పని చేస్తున్నారు. చిత్తూరు జిల్లాతోపాటు తిరుపతి జిల్లా చేనేత పరిశ్రమకు ఎంతో ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా మదనపల్లెలాగే సత్యవేదు, వరదయ్యపాళెం మండలాలు ఈ పరిశ్రమకు కేంద్ర బిందువయ్యాయి. జిల్లాలో 10 వేలు మగ్గాలు ఉన్నాయి. ఇందులో సత్యవేదు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో 5 వేలు మగ్గాలు ఉండడం గమనార్హం. ఈ పరిశ్రమపై తిరుపతి జిల్లాల్లో ప్రత్యక్షంగా 10 వేలు మంది ఆధారపడి జీవిస్తున్నారు.

మారిన పరిస్థితి

ఇరవై ఏళ్ల కిందట చేనేత పరిశ్రమలో పురుషులదే ఆధిపత్యం ఉండేది. గతంలో ఇంట్లో ఒక్కరు పని చేసినా కుటుంబం ఏ బాధ లేకుండా గడిచేది. కాలక్రమంలో పరిస్థితులు తలకిందులయ్యాయి. ముడి సరుకులు ధరలు పెరగడం, చేనేత వస్త్రాల ధరలు తగ్గడంతో కార్మికుల ఆదాయం స్వల్పస్థాయికి పడిపోయింది. దీంతో కుటుంబం గడవని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంక్షోభ సమయంలో మహిళలు మేము ఉన్నామంటూ ముందుకు వచ్చి మగ్గం నేసేందుకు మొగ్గు చూపారు. భర్తలకు చేదోడుగా ఉంటూ మగ్గం నేయడం, నూలు వడకడం, పోగు అతకడం తదితర పనులు చేస్తున్నారు. తద్వారా కుటుంబ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తూ చేనేత పరిశ్రమలో మహిళలే కీలకం అయ్యారు. ఇలా సత్యవేదు నియోజకవర్గంలోని సత్యవేదు, నారాయణవనం, నాగలాపురం, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగలో చేనేతలు తయారు చేసిన వస్త్రాలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ధర్మవరం, ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

భర్తకు చేదోడుగా ఉండాలని..



మాది తమిళనాడులోని ఆరణి గ్రామం. నా వివాహమైన తొలినాళ్లలో నా భర్త ఒక్కడే ఈ పనిచేసేవారు. నేడు ఆయన సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. మా ఆయన్ని ఒప్పించి నేత పని నేర్చుకొన్నా. ఇప్పుడు ఇద్దరం ఒకే మగ్గంపై చీరలు నేస్తున్నాం. మూడు రోజులకే ఒక చీర నేస్తాం. చీరకు కు రూ. 500 కూలీ వస్తుంది. నా భర్తకు నేత పనిలోనే నేను సాయంగా ఉంటున్నాను.

– బి. తులసి, దళవాయి అగ్రహారం

25 ఏళ్లుగా నా భర్తకు తోడుగా నేస్తున్నా



వారం రోజుల్లో ఒక చీర నేస్తేరూ. 500 వస్తుంది. ప్రస్తుతం ముడి సరుకుల ధరలు పెరగడంతో చీరల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో మా ఆయన ఆదాయం తగ్గిపోయింది. ఈ పరిస్థితిలో నా భర్తకు తోడుగా సాగాలని నిర్ణయించుకున్నాను. నేను కూడా నేత పని నేర్చుకుని చేస్తున్నాను. ఇలా నేను, నా భర్త ఇద్దరు కష్టపడినా నెలకు రూ.4వేలు రావడంలేదు. అదనంగా పడుగు తయారీ నూలు పేడి ఇస్తూ కొంత సంపాదిస్తున్నా. 25 ఏళ్లుగా భర్తకు తోడుగా నేత పనిలో కలసి పనిచేస్తున్నాను.

– వాసంతి, కాళమనాయుడుపేట

కుటుంబ బాధ్యత పంచుకోవాలని..



నా పెళ్లయిన కొత్తలో నా భర్త ఒక్కరే మగ్గం పని చేసేవారు. దాంతో ఇంటి అద్దె, కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఇప్పుడు ఇద్దరు నేత పని చేస్తూ వారానికి రెండు చీరలు తయారు చేస్తాం. ఇద్దరం కష్టపడుతున్నాం. పిల్లల్ని చదివించడం కష్టంగా ఉండేది. సీఎం ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, అమ్మఒడి పథకం తల్లుల ఖాతాలో ఇస్తున్నారు. పిల్లల చదువులు ఇబ్బంది లేకుండా సాగుతోంది. నేనూ నేత పని చేయడంతో మా కుటుంబ ఆదాయం కొంత మెరుగుపడింది.

– వి. ఈశ్వరి, కేఎస్‌పేట, సత్యవేదు మండలం

మగ్గంపైనే రోజు గడుస్తోంది



మా ఆయనకు తోడుగా నేనూ నేత పని చేస్తున్నాను. మాకు మగ్గంపైనే రోజంతా గడుస్తోంది. ఇద్దరం కలసి పని చేస్తున్నాం. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. మా అబ్బాయి మేము పడుతున్న కష్టం పడకూడదని ఇంజినీరింగ్ చదివించాం. అందుకు వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయం అందడంతో మా అబ్బాయి సాఫీగా చదువు పూర్తి చేసి, ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం అంతా సవ్యంగా సాగుతోంది. నా భర్తకు మగ్గం పనిలో సాయం చేయడం ఎంతో తృప్తిగా ఉంది.

– ఉమ్మిటి, పద్మ, కేఎస్‌పేట. సత్యవేదు మండలం.

నేత పనితో కుటుంబాన్ని పోషిస్తున్నా..



నేత పని తెలిసి ఉండడంతో భర్త చనిపోయినా నేత పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. వింతంపు పింఛన్, అమ్మఒడి పథకాలు అందుతుండడంతో పిల్లలన్ని చదివిస్తున్నాను. రోజు పడుగు, పేక నూలు చుట్టి అదనంగా కూలీ సంపాదిస్తున్నాను. ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించి, నేత కార్మికులను ఆదుకుంటే మేలు. నేత కార్మికులకు విద్యుత్ బిల్లు భారం లేకుండా చూడాలని మనవి.

– జీ. మల్లీశ్వరి, కాళమనాయుడుపేట

చేతి పని కూడు పెడుతోంది



నాబిడ్డ ఐదేళ్లప్పుడే భర్త చనిపోయాడు. చేతి పని తెలిసి ఉండడం వల్ల నేత కూలీగా మారాను. ఒక్కగానొక్క కూతుర్ని డిగ్రీ చదివించాను. ప్రస్తుతం నేత పని కూలీలు బాగా తగ్గింది. జీవనం ఇబ్బందిగా ఉంది. వితంతుపింఛను వస్తోంది. నెల నెల వచ్చే వితంతుపింఛను, నేత పనితో వచ్చే కూలీతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పనిలో కష్టం ఎక్కువగా ఉంటోంది. ఇతర పనులకు వెళ్లలేక ఇంట్లోనే నేత పని తో జీవిస్తున్నాం.

– ఎస్. చంద్రకళ, కాళమనాయుడుపేట. సత్యవేదు మండలం.

నడిరోడ్డులో పోస్టర్ల ఆవిష్కరణ

- ట్రాఫిక్‌కు అంతరాయం
- మండిపడిన జనం



రోడ్డుకు అడ్డంగా నిలబడి పవన్‌కళ్యాణ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నాగలాపురం: పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలి గాంధీ విగ్రహం వద్ద గురువారం టీడీపీ, జనసేన మండల నాయకులు, కార్యకర్తలు వచ్చే నెల 2వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని పోస్టర్లను ఆవిష్కరించారు. సాయంత్రం పూట రద్దీగా అధికంగా ఉన్న సమయంలో రోడ్డుకు అడ్డంగా నిలబడి కార్యక్రమం నిర్వహించడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో స్థానిక ప్రజలు, వాహన చోదకులు ఇక్కట్లు పడ్డారు. విద్యార్థులు, ప్రయాణికులు బస్సు ఎక్కడానికి కూడా వీలులేక ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, విద్యార్థులు, తెలుగు తమ్ముళ్లపై మండిపడ్డారు.

హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ ఎం.శ్రీలత ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ప్రతి ఒక్కరికీ ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యం చేయించుకోవచ్చన్నారు. అలాగే ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడుతూ ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

రాజీవ్‌నగర్ సర్వే వాయిదా

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో శుక్రవారం చేపట్టాల్సిన సర్వే వాయిదా వేస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, వీర్వోలు, సర్వేయర్లు పాల్గొనున్న నేపథ్యంలో ఇంటి పట్టాల విచారణ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి 2వ తేదీ విచారణ చేస్తామన్నారు.

మా భూముల జోలికొస్తే ఊరుకోం

బత్తలవల్లం గ్రామస్తులు



భూముల వద్ద గ్రామస్తులు నిరసన

వరదయ్యపాళెం: సంవత్సరాల తరబడి తమ ఆధీనంలో ఉన్న భూములను అటవీశాఖ అధికారులు వనమహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటేందుకు ప్రయత్నించడం సరికాదని, తమ భూముల జోలికొస్తే దేనికైనా సిద్ధమేనని బత్తలవల్లం గ్రామస్తులు తేల్చి చెబుతున్నారు. వివాదాస్పదంగా మారిన భూముల వద్ద గురువారం మహిళలు, యువకులు నిరసన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, కూటమి నేతలు తమకు మద్దతు పలికి న్యాయం చేయాలని వేడుకున్నారు. పెద్దల కాలం నాటి నుంచి తమ ఆధీనంలో ఉన్న భూములను అటవీ అధికారులు చదును చేసి మొక్కలు నాటేందుకు ప్రయత్నించడం వెనుక కుట్ర కోణం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజశేఖర్, అటవీశాఖ ఎఫ్ఎస్ఓ దేవరాజులు, సిబ్బంది ఆందోళనకారుల వద్దకు చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. వారి వద్ద ఉన్న వివరాలను తహసీల్దార్ పరిశీలించారు. వారి వినతులను ఆయన స్వీకరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ, అటవీశాఖ అధికారుల సంయుక్త సర్వే చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, అంతవరకు సంయమనం పాటించాలని గ్రామస్తులకు తహసీల్దార్ సూచించారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించండి

బత్తలవల్లం వివాదాస్పద భూ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చొరవ చూపాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా అధికారులను కోరారు. ఆ మేరకు ఆయన తిరుపతిలోని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్, జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌ను కలసి సమస్యను విన్నవించారు. బత్తలవల్లం గ్రామస్తులు, అటవీశాఖ అధికారుల మధ్య తలెత్తిన భూ వివాదాన్ని సున్నితంగా పరిష్కరించాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బత్తలవల్లం సమీపంలోని భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమించుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆ భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని డీఎఫ్ఓకు ఎమ్మెల్యే విన్నవించారు. దీనిపై స్పందించిన డీఎఫ్ఓ, జేసీ మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో రెవెన్యూ, అటవీశాఖకు చెందిన రికార్డులు పరిశీలించి మొదటగా ఆ భూమి ఎవరికి చెందుతుందో నిర్ణయించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటివరకు ఆ భూములు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని క్షేత్రస్థాయి అటవీ అధికారులకు డీఎఫ్ఓ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

శ్రీకాళహస్తి: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 31వ తేదీన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 31వ తేదీ శనివారం పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దనే ఉండి పింఛన్లు అందుకోవాలని కోరారు.

కనులపండువగా కల్యాణోత్సవం



శ్రీకృష్ణుని కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో ఉన్న శ్రీకృష్ణ భజన మందిరంలో గురువారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణ భజన మందిరం అధ్యక్షుడు మిద్దె ఇందుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ చేసి కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అకార్డ్ స్కూల్ డైరెక్టర్ వేమూరి ప్రశాంత్ రెడ్డి, దివ్య జ్యోతి, టీటీడీ జేఈఓ గౌతమి, రోహిత్ దంపతులు కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా వేదికపై ముందుండి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం టీటీడీ జేఈఓ గౌతమి దంపతుల కుటుంబ సభ్యులకు వేద పండితులు ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు పసుపు కుంకుమ గాజులు అందజేశారు. అనంతరం టిటిడి జేఈఓ గౌతమి చేతుల మీదుగా విందు భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేను వద్దంటే మీటింగ్ పెడతావా...?

- నాలుగు రోజులు ఆగలేవా...?
- ఇన్‌చార్జి ఈఓగా రత్నమ్మ తొలగింపు
- పంచాయతీ సమావేశం వాయిదా

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'నేను బయట ఉన్నాను... నాలుగు రోజులు ఆగలేవా... అన్ని సమావేశాలకు వస్తాను.. నేను చెప్పేవరకు ఎలాంటి సమావేశాలు పెట్టొద్దని చెప్పినా మీటింగ్ పెట్టాలని సర్క్యులర్ జారీ చేస్తావా...? అంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రేణిగుంట ఈఓపీఆర్‌డీ ఎం.వెంకటరత్నమ్మకు వార్నింగ్ ఇచ్చారు. పనిలో పనిగా ఎంపీడీఓ విష్ణుచరంజీవికి ఫోన్‌చేసి ''ఎవరు ఆమెను రేణిగుంట పంచాయతీకి ఇన్‌చార్జి ఈఓగా పెట్టింది.. వెంటనే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆమెను తప్పించి మీటింగ్ కాన్సిల్ చెయ్...'' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. చేసేది లేక ఎంపీడీఓ ఆమెను ఇన్‌చార్జి ఈఓ బాధ్యతల నుంచి తప్పించి పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని రద్దు చేసి, వాయిదా వేశారు.

రేణిగుంట పంచాయతీకి రాజకీయ గ్రహణం

రేణిగుంట పంచాయతీ సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్‌ల సహా వార్డు సభ్యులంతా వైఎస్సార్ సీపీ వారే. వారిలో కొందరు టీడీపీ, ఇతర పార్టీల్లోకి చేరారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే, పంచాయతీలో టీడీపీ నాయకులు రేణిగుంట పంచాయతీపై కర్రపెత్తనం చెలాయించాలని భావించి నిత్యం పంచాయతీ కార్యాలయంలోనే అనధికారింగా తిష్ట వేసి పంచాయతీ అభివృద్ధి పనులన్నీ వారి కన్నుసన్నల్లోనే జరిగేలా దర్పం ప్రదర్శిస్తున్నారు. ఈ మూడు నెలల్లో టీడీపీ నాయకులు చేసిన పనులకు ఎంబుక్ రికార్డు చేసి పంచాయతీ నిధుల నుంచి బిల్లులు మంజూరు చేయాలని ఇన్‌చార్జి ఈఓగా ఉన్న మండల ఈఓపీఆర్‌డీ వెంకటత్నమ్మపై కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అయితే గతంలో చేసిన పనుల బిల్లులే పెండింగ్ ఉన్నాయని, అవి క్లియర్ అయ్యాక ఈ బిల్లులు కూడా పెడతామని ఆమె నిరాకరించడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆమెపై ఫిర్యాదు చేశారు.


Proceedings of the Mandal Parishad Dev. Officer: M.P.P., Renigunta
Present : Sri. D.Vishnu Chaitanyam, M.Sc.,M.B.A.

వెంకటరత్నమ్మను తప్పిస్తూ ఎంపీడీఓ జారీ చేసిన ఉత్తర్వులు

సర్వసభ్య సమావేశం మూడు సార్లు వాయిదా..

గ్రామ పంచాయతీ సర్వ సభ్య సమావేశం ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. వార్డు సభ్యులు కోరినా పట్టించుకోలేదు. పంచాయతీలో సంత, ఆటో స్టాండ్ గేటు వసూళ్లు, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ దుకాణ సముదాయాల వేలం పాట వేయకుండా పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని, వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఎక్కువ మంది వార్డు సభ్యులు ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి హోదాలో ఆమె ఈనెల 29న మధ్యాహ్నం 3గంటలకు పంచాయతీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని సర్క్యులర్ జారీ చేశారు. అయితే తన అనుమతి లేకుండా సమావేశం పెట్టాలని నిర్ణయించడంపై ఎమ్మెల్యే ఆగ్రహించారు. త్వరలోనే బదిలీ అయ్యి వెళ్లిపోతున్నారని, తోక జాడిస్తే ఊరుకోనని హెచ్చరించారు.

అమ్మభాషకు ఆణిముత్యాల దండ





తేనెకన్నా తియ్యన.. తెలుగెంతో కమ్మన.. అంటూ మాతృభాష తెలుగు గొప్పదనాన్ని కొనియాడుతూ సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వాడవాడలా తెలుగుభాషా దినోత్సవం జరుపుకున్నారు. గిడుగుకు నివాళులర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు. – వరదయ్యపాళెం/శ్రీకాళహస్తి/ఏర్పేడు/రేణిగుంట/నాగలాపురం/సత్యవేదు











అగ్ని ప్రమాదంలో కారు బుగ్గి



రేణిగుంట: శ్రీకాళహస్తి మార్గం రేణిగుంట మండలంలోని గోపాలపురం సమీపంలో గురువారం శ్రీకాళహస్తి వైపు వెళుతున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కాలిపోయింది. రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ కథనం మేరకు.. తిరుపతికి చెందిన రాజారెడ్డి తన కారులో డ్రైవర్ అశోక్‌తో కలసి తిరుపతి నుంచి వ్యక్తిగత పని నిమిత్తం శ్రీకాళహస్తికి బయలుదేరారు. రేణిగుంట మండలం గోపాలపురం సమీపంలోకి వెళ్లే సరికి ఇంజిన్‌లో నుంచి అకస్మాత్తుగా పొగ వచ్చి మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో వారు కారులో ఉన్న పలు ఫైళ్లు, డాక్యుమెంట్లు తీసుకుని కిందకు దిగారు. అక్కడున్న వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక వాహనం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం

వరదయ్యపాళెం: క్రీడలతో మానసిక వికాసం సాధ్య మని వరదయ్యపాళెం హైస్కూల్ హెచ్ఎం రమణ య్య అన్నారు. వరదయ్యపాళెం హైస్కూల్‌లో పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు పీడీ బందిల కుమార్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గోవర్ధనపురం హైస్కూల్‌లో పీడీ ముద్దుకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం రవీంద్ర రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.